## క్లుప్తంగా

### ఉపాధిహామీ పనుల పర్యవేక్షణ



మాట్లాడుతున్న డీఆర్‌డీవో రవీందర్

**రామగుండం:** అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ గ్రామ పంచాయతీ పరిధిలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులతో పాటు కొత్త కుంటలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల పురోగతిని గురువారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలకు కొలతలపై అవగాహన, పనివేళల్లో మార్పులు, ఎండలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పర్యవేక్షణలో ఎంపీడీవో ఎం.ఏ.అలీం, ఏపీడీలు అమృతకుమార్, సత్యనారాయణ, ఏపీవో టి.రమేశ్, ఐకేపీ ఏపీఎం సంది నర్సమ్మ, కార్యదర్శి స్రవంతి, టెక్నికల్ అసిస్టెంట్ లీల, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణ్ ఉన్నారు.

### వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై

**ముత్తారం:** ముత్తారంలో గురువారం ఎస్సై మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. వాహనాదారుల లైసెన్స్, ధ్రువీకరణపత్రాలను పరిశీలించారు.

### బీఆర్‌ఎస్ బెల్లంపల్లి ఇన్‌చార్జిగా 'గంట'



**ఓదెల:** ఓదెల జెడ్పీటీసీ గంట రాములుయాదవ్‌ను మంచిర్యాల జిల్లా బీఆర్‌ఎస్ బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. ఈసందర్భంగా బెల్లంపల్లిలో బీఆర్‌ఎస్ బలోపేతానికి, మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో విజయం కోసం కృషి చేస్తానని రాములుయాదవ్ పేర్కొన్నారు.

### మండల సర్వసభ్య సమావేశం వాయిదా

**ధర్మారం:** మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ ప్రకటించారు. మండల పరిషత్ సమావేశంలో గురువారం సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేయగా కోరానికి సరిపడా ఎంపీటీసీలు హాజరుకాక పోవటంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ ప్రకటించారు. ఎంపీడీవో ప్రవీణ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

### మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతు

**ముత్తారం:** మండలంలోని మచ్చుపేటలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు గురువారం అధికారులు మరమ్మతు చేపట్టారు. తాగునీరు సరఫరా కోసం పైప్‌లైన్ లీకేజీని గుర్తించి మరమ్మతు చేస్తున్నట్లు ఈఈ పూర్ణచందర్ తెలిపారు. మరమ్మతు పూర్తికాగానే తాగునీరు సరఫరా అవుతుందని ఆయన తెలిపారు. డీఈఈ ప్రసాద్, ఏఈ వంశీకృష్ణ ఉన్నారు.

### ఆశ్రమ విద్యార్థులకు సన్మానం



సన్మానిస్తున్న మద్దెల దినేశ్

**రామగుండం:** పట్టణంలోని తబితా ఆశ్రమంలోని పలువురు విద్యార్థినులు ఇటీవల ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన వారిని గురువారం రాత్రి ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ సన్మానించారు. వి.సంధ్య (955), ఎం.అర్చన (750), వి.మమత (648), ఎస్.లక్ష్మి (454), ఎం.అనూష (413), ఎస్.రేణుక (276) ఉన్నారు. ఆశ్రమ నిర్వాహకుడు వీరేందర్‌నాయక్ ఉన్నారు.

### విద్యార్థులకు వైద్య పరీక్షలు

**జ్యోతినగర్:** బాలికా సాధికారత మిషన్ శిబిరంలో పాల్గొనే విద్యార్థులకు ఎంపికతో పాటు వైద్య పరీక్షలను నిర్వహించారు. గురువారం ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని ఉద్యోగ వికాస కేంద్రం మిలీనియం హాలులో బేస్‌లైన్ సర్వేతో పాటు వైద్య పరీక్షలు నిర్వహించారు. వేసవి కాలంలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 120 మంది బాలికలకు వివిధ రంగాలలో శిక్షణ అందించేందుకు సంస్థ ప్రత్యేకంగా కార్యాచరణ సిద్ధం చేస్తుందని సీఎస్సార్ డీజీఎం ప్రవీణ్ చౌదరి తెలిపారు.

# పోలింగ్ చిట్టీల పంపిణీకి కసరత్తు

- నియోజకవర్గంలో 2,24,414 మంది ఓటర్లు
- సూపర్‌వైజర్లకు స్లిప్పులు అందజేసిన అధికారులు
- నేటి నుంచి ఇంటింటికీ పంపిణీ చేయనున్న బీఎల్‌వోలు



అవగాహన కల్పిస్తున్న సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్

**కోల్‌సిటీ:** ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగంలో ఓటరు స్లిప్పులు కీలకం. జాబితాలో ఓటరు పేరు ఉన్నప్పటికీ.. ఓటరు స్లిప్పులు ఇంటికి రాకపోతే, ఓటుహక్కు వినియోగానికి ఓటర్లు సుముఖత చూపరు. ఓటింగ్ శాతం పెంచాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రామగుండం నియోజకవర్గం పరిధిలో శుక్రవారం ఇంటింటా ఓటరు స్లిప్పుల పంపిణీ చేయడానికి శ్రీకారం చుడుతున్నారు. గురువారం సాయంత్రం ఓటర్ల పేరున ముద్రించిన ఓటరు స్లిప్పులను నగరపాలక సంస్థకు చేరుకున్నాయి.

**260 పోలింగ్ కేంద్రాలు..**

నియోజకవర్గం పరిధిలో 2,25,414 మంది ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గంలో 260 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 26 మంది సూపర్‌వైజర్లు ఉండగా, 260 మంది బీఎల్‌వోలు సేవలందిస్తున్నారు. బీఎల్‌వోల ద్వారా ఇంటింటికీ ఓటరు స్లిప్పులను పంపిణీ చేయడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు.

**ఓటరు స్లిప్పుల పంపిణీపై అవగాహన..**

నియోజవర్గం ఆర్‌వో, జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ విజయ్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో బీఎల్‌వోల ద్వారా ఓటరు స్లిప్పుల పంపిణీకి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూపర్‌వైజర్లకు ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. మరణించిన వారు, శాశ్వతంగా మరో ప్రాంతానికి తరలివెళ్లిన వారు, ఒకే వ్యక్తిపై రెండు ఓటరు స్లిప్పులు వస్తే పంపిణీ చేయొద్దని సూచించారు. ఇంటి కుటుంబ సభ్యులకు మాత్రమే ఓటరు స్లిప్పులను పంపిణీ చేసి వారి నుంచి సంతకాలు తీసుకోవాలని, ఇతరులకు ఎట్టి పరిస్థితుల్లో స్లిప్పులు ఇవ్వకూడదని ఆదేశించారు.

## బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం



ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చందర్

**గోదావరిఖని:** రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గురువారం ప్రచారం నిర్వహించారు. స్థానిక 35, 36 డివిజన్లలో కాలినడక తిరుగుతూ కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. సింగరేణి షాపింగ్ కాంప్లెక్స్ కావాలని స్థానిక ఎమ్మెల్యే ఇక్కడ ఉన్న సింగరేణి క్వార్టర్లను తొలగించడం దుర్మార్గమైన చర్య అని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే రామగుండంలో మెడికల్ కళాశాల ఏర్పాటు జరిగిందన్నారు. నాయకులు పాముకుంట్ల భాస్కర్, చెలుకలపెల్లి శ్రీనివాస్, కొటం బాబు, నారాయణదాసు మారుతి పాల్గొన్నారు.

## ఓసీపీల్లో షిఫ్ట్ వేళలు మార్చాలి



వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

**గోదావరిఖని:** మండుతున్న ఎండల దృష్ట్యా ఓసీపీల్లో షిఫ్ట్‌వేళలు మార్చాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. జీడీకే-5 ఓసీపీలో ప్రాజెక్టు మేనేజర్ అనిల్‌గబాలేకు గురువారం వినతిపత్రం అందజేశారు. మొదటి షిఫ్ట్ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, రెండో షిఫ్టు సాయంత్రం 4 నుంచి రాత్రి 11గంటల వరకు మార్చాలన్నారు. నాయకులు గుర్రం ప్రభుదాస్, బోగ సతీశ్‌బాబు, గండి ప్రసాద్, చందా తిరుపతి, చీకటి అంజయ్య, సోమ నర్సయ్య, భక్తి శ్రీనివాస్, సత్యనారాయణ, గోవిందరాజులు, సురేశ్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

**అక్రమ నిర్మాణం తొలగింపు**

**గోదావరిఖని:** స్థానిక వంకబెండ్ సమీపంలో సింగరేణి క్వార్టర్ పక్కన అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్‌ను కూల్చివేశారు. ఆర్జీ-1 ఏరియాలోని సెక్టార్ వన్‌లో డీ-439 క్వార్టర్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో అదనపు నిర్మాణం ఏర్పాటు చేశారు. ఉద్యోగ విరమణ కోసం క్వార్టర్ అప్పగించే క్రమంలో అక్రమ కట్టడాన్ని గుర్తించిన అధికారులు వాటిని తొలగించాలని ఆదేశించారు. స్పందించిన ఉద్యోగి అక్రమంగా ఉన్న షెడ్‌ను కూల్చివేసి కాంపౌండ్ నిర్మించాడు. ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎవరైనా కంపెనీ ఆస్తులను ధ్వంసం చేసినా సంస్థ స్థలాలను ఆక్రమించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## కొప్పుల ఈశ్వర్ గెలుపొందాలని ముడుపు



ముడుపు కడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

**ధర్మారం:** పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతిలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు ఓటమి తప్పదని పార్లమెంట్ ఎన్నికల ధర్మపురి నియోజకవర్గ కోఆర్డినేటర్ రఘువీర్‌సింగ్ జోస్యం చెప్పారు. కొప్పుల గెలుపొందాలని ధర్మారం మండలం ఖిలావనపర్తి గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గురువారం బీఆర్‌ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో ముడుపు కట్టారు. అనంతరం రెండు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘువీర్‌సింగ్ మాట్లాడుతూ, అబద్ధాల హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్న కుటుంబానికే కాంగ్రెస్ ఎంపీ టికెట్ కేటాయించటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కేవలం వారి పరిశ్రమలను కాపాడుకునేందుకే ఎంపీగా పోటీ చేస్తున్నారని ఆరోపించారు. మంత్రిగా ఈశ్వర్ చేసిన ప్రజాసేవే ఎంపీగా గెలుపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు బలరాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమం కోరేది బీఆర్‌ఎస్



కూలీలతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మధు

**మంథని:** ఎన్నికలు వస్తేనే కాంగ్రెస్‌కు పథకాలు గుర్తుకు వస్తాయని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ పెద్దపల్లి అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా గురువారం చిన్నఓదాల, గోపాల్‌పూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రజా సంక్షేమాన్ని కోరుకుందని, ఏనాడు ప్రజలకు పథకాల ఆశ చూపలేదన్నారు. ప్రజల అవసరాల గురించి పథకాలకు రూపకల్పన చేసిన చరిత్ర గత ప్రభుత్వంది అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అధికారం అప్పగించి గోసపడుతున్నామని మళ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే నష్టపోతామన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఈశ్వర్‌ను ఆదరించాలని, గతంలో మంత్రిగా ఈ ప్రాంతానికి ఎంతో సేవలందించారని పేర్కొన్నారు. ప్రచారంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## క్రైం న్యూస్

**కారు బోల్తా.. ఇద్దరు సురక్షితం**

**ముత్తారం:** ముత్తారం మండలం ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై గురువారం ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఓ కారు చెట్లపొదల్లో బోల్తాపడింది. మిరియాలగూడకు చెందిన ధారవత్తు నాగేశ్, ఐతగాని నాగరాజు తమ స్నేహితుడి వివాహానికి ముత్తారం వస్తుండగా ప్రమాదం జరిగింది. కారు బోల్తా ఘటనలో వారిద్దరు సురక్షితంగా బయటపడ్డారు. ఎస్సై మధుసూదన్ ఆదేశాల మేరకు కానిస్టేబుల్ సంతోష్ ఘటన స్థలం వద్ద వివరాలు సేకరించారు.

**రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు**

**ఓదెల:** మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన కర్ర సాత్విక్, హర్షిణి గురువారం స్కూటీపై వెళ్తుండగా అకస్మాత్తుగా కుక్క అడ్డుగా రావడంతో తప్పించబోయి కిందపడ్డారు. ఇద్దరికి గాయాలు కావడంతో సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేసి అనంతరం 108లో సుల్తానాబాద్ ఆస్పత్రికి తరలించారు.

**వ్యక్తి ఆత్మహత్యాయత్నం**

**రామగుండం:** అబాది రామగుండంలో గురువారం బొద్దుల అవినాష్(33) అనే వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గుర్తించి గోదావరిఖనిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నిజాం ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. కాగా ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ విషయమై రామగుండం ఎస్సై సతీశ్‌ను వివరణ కోరగా, తమకు ఏలాంటి ఫిర్యాదు అందలేదని సమాధానమిచ్చారు.

**విద్యుత్ తీగలపై పడిన చెట్టు కొమ్మ**

**రామగుండం:** అబాది రామగుండంలోని పట్టణ ఆరోగ్య కేంద్రం ఎదుట గురువారం రాత్రి చెట్టు కొమ్మ విరిగి విద్యుత్ తీగలపై పడడంతో షార్ట్ సర్క్యూట్ కాగా పలువురి ఇళ్లలో గృహోపకరణాలు కాలిపోయాయి. షార్ట్ సర్క్యూట్ బాధితులకు ఆర్థిక సాయం అందజేయాలని కోరుతున్నారు.

## సంక్షిప్త వార్తలు

**కాంగ్రెస్ కార్పొరేషన్ క్లస్టర్ల నియామకం**

**గోదావరిఖని:** రామగుండం కార్పొరేషన్‌లో కాంగ్రెస్ చీఫ్ క్లస్టర్స్, జోనల్ క్లస్టర్లు, ప్రత్యేక ఆహ్వానితులను ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ఆదేశాల మేరకు నియమించినట్లు కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేశ్ తెలిపారు. ఈ మేరకు గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. కార్పొరేషన్‌లో చీఫ్ క్లస్టర్లుగా కాల్వ లింగస్వామి, మహంకాళి స్వామి, మాదరబోయిన రవికుమార్, దీటి బాలరాజు, ప్రత్యేక ఆహ్వానితులుగా పాతిపెల్లి ఎల్లయ్య, కొటం సతీశ్, గుండేటి రాజేశ్, హరిప్రసాద్, నజీముద్దీన్, దాసరి విజయ్‌ను నియమించారు. అలాగే జోనల్ క్లస్టర్లుగా మారెల్లి రాజిరెడ్డి, అంజుల్, అసిఫ్‌పాషా, కొలిపాక సుజాత, పాతిపెల్లి రవి, చుక్కల శ్రీనివాస్, ముస్తఫా, గట్ల రమేశ్, యుగేందర్, తిప్పారపు శ్రీనివాస్, సాంబమూర్తి, పెద్దెల్లి ప్రకాశ్‌ను నియమించామని పేర్కొన్నారు. అలాగే 50డివిజన్లకు డివిజన్ క్లస్టర్లను నియమించినట్లు వివరించారు.

**శ్రీసీతారామచంద్రస్వామి పట్టాభిషేకం**

**రామగుండం:** పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో గురువారం శ్రీసీతారామచంద్రస్వామి పట్టాభిషేక వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలతో పాటు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కోలాహలం శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి తాటిపెల్లి శివప్రసాద్, శ్రీకాంత్, ఆలయ పూజారి చంద్రశేఖరశర్మ ఉన్నారు.

**వేసవి శిక్షణ శిబిరాన్ని వినియోగించుకోండి**

**రామగిరి:** వేసవి కాలంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత క్రీడా శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ-3, ఏపీఏ జీఎం ఎన్.సుధాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను 18ఏళ్లలోపు సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ఈ నెల 29 నుంచి 25 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సెంటనరీకాలనీ రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో వాలీబాల్, ఫుట్‌బాల్, ఆర్చరీ, హాకీ క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఆసక్తి గల వారు ఈ నెల 28 తేదీలోపు తమ పేర్లను ఆర్జీ-3 జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

**అవయవ దానం**

**సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్:** సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంటకు చెందిన బుర్ర రమాదేవి (40) బుధవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 18న పొలం పనుల కోసం బైక్‌పై భర్త కొమురయ్యతో కలిసి వెళ్లి వస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడడంతో సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌కు తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు యశోద ఆసుపత్రిలో చికిత్స కోసం తరలించగా బ్రెయిన్ డెడ్ కావడంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న జీవన్ దాన్ ఆర్గాన్ డోనార్ సంస్థ మృతురాలి కుటుంబీకులను సంప్రదించారు. సంప్రదించగా అవయవ దానం చేసేందుకు ముందుకు వచ్చారు. అవయవ దానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచినందుకు మృతురాలి కుటుంబీకులను అభినందించారు.

**ఓటుహక్కును వినియోగించుకోవాలి**

**ముత్తారం:** మండలంలోని హరిపురంలో గురువారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ఓటుహక్కుపై అవగాహన కల్పించింది.

**కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు**

**కాల్వశ్రీరాంపూర్:** మండలంలోని ఇప్పలపల్లి గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు గురువారం రెండో రోజు కొనసాగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు స్థాపిత దేవతాపూజలు, హోమాలు, ధాన్యాధివాసం, పుష్పాదివాసం, ఫలాదివాసం, శయాదివాసం, కుంకుమ పూజలు, హారతి మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అర్చక పురోహితులు నిట్టూరి అంబరీష్ శర్మ, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**ఉపాధి కూలీలకు సౌకర్యాలు పెంచండి**

**రామగుండం:** ఉపాధి కూలీలకు గరిష్ఠ ఉష్ణోగ్రతల దృష్ట్యా పనిస్థలాల్లో సౌకర్యాలు కల్పించాలని కోరారు. గురువారం లింగాపూర్‌కు చెందిన సామాజిక కార్యకర్త నిమ్మరాజుల రవి ఎంపీడీవో ఎం.ఏ.అలీంకు లిఖితపూర్వక వినతిపత్రం అందజేశారు.

## కాంగ్రెస్ గూటికి ఈర్ల కొమురయ్య



పార్టీలోకి ఆహ్వానిస్తున్న జగ్గారెడ్డి

**పెద్దపల్లిరూరల్:** ఇటీవల బీఎస్పీకి రాజీనామా చేసిన ఈర్ల కొమురయ్య గురువారం తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ను వీడి బీఎస్పీలో చేరిన కొమురయ్య ఆ పార్టీని ఇటీవల వీడారు. కాంగ్రెస్ చేరికల కమిటీ చైర్మన్ జగ్గారెడ్డి పార్టీ కండువా కప్పి కొమురయ్యను ఆహ్వానించారు. కాగా ఈర్ల కొమురయ్య, మూటూరి రవి చేరికను తాము అనుమతించడం లేదని పార్టీ జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేశారని, వారి చేరికలను తాము గుర్తించబోమని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

**యైటింక్లయిన్‌కాలనీ:** 'మేమెప్పుడూ మీ కుటుంబ సభ్యులమే' అని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. గురువారం కాలనీ భవాని గార్డెన్‌లో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. ప్రజలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్, బీజేపీలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, రామగుండం మేయర్ అనిల్‌కుమార్, శంకర్‌నాయక్, సాగంటి శంకర్, మహంకాళి స్వామి, రాజేశ్, అక్బర్ అలీ, కిషన్ నాయక్, మార్క రాజు, సంపత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాములు, జక్కుల దామోదర్, ప్రసాద్, రాజిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, అవినాష్, సారయ్య నాయక్, లావణ్య, సునీత, స్వర్ణలత, అనిత పాల్గొన్నారు.

**అవినీతి బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలి**

**రామగుండం:** అవినీతిలో మునిగిసన బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలని పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ అన్నారు. గురువారం రాత్రి అంతర్గాం మండల కేంద్రంలో ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడారు. రామగుండం, చెన్నూర్ ఎమ్మెల్యేలు మక్కాన్ సింగ్‌ఠాకూర్, వివేక్ వెంకటస్వామి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. రామగుండం నియోజకవర్గ పరిధిలో 3,500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించగా అంతర్గాం మండల పరిధిలో అర్హులైన వెయ్యి మందికి ఇళ్లు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఉరిమెట్ల రాజలింగం, మండల ఇన్‌చార్జి పెండ్రు హన్మాన్ రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్, సింగం కిరణ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

## శరీరం సహకరించలే.. కాలేజీకి వెళ్లలే

- కిడ్నీలు పనిచేయకపోయినా 927 మార్కులు సాధించిన సిరి
- ఇంటర్ ఫలితాల్లో కళాశాల టాపర్



తల్లిదండ్రులు వెంకటలక్ష్మి-పోషంతో సిరి

**గోదావరిఖనిటౌన్(రామగుండం):** రెండు కిడ్నీలు చెడిపోయి, డయాలసిస్ చేయించుకుంటోంది.. కాలేజీకి వెళ్లేందుకు శరీరం సహకరించకుంటే ఇంట్లోనే ఉండి, యూట్యూబ్‌లో క్లాసులు వింటూ చదువుకుంది.. తన కష్టానికి ఫలితం దక్కింది.. ఇంటర్ ద్వితీయ సంవత్సరం సీఈసీ విభాగంలో 927 మార్కులతో సత్తా చాటింది ఎన్టీపీసీ కృష్ణానగర్‌కు చెందిన కునారపు సిరి. ఆమె స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాల టాపర్‌గా నిలిచింది. సిరికి 12 ఏళ్ల వయసులో ఆటో ఇమ్యూన్ వ్యాధి బారిన పడటంతో రెండు కిడ్నీలు పని చేయకుండా పోయాయి. కళాశాలకు వెళ్లడానికి శరీరం సహకరించకపోవడంతో ఇంట్లోనే ఉండి చదువుకుంది. తండ్రి పోషం సెంట్రింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పేద కుటుంబానికి చెందిన తాము సిరికి వారానికి రెండుసార్లు డయాలసిస్ చేయించేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని తెలిపాడు. కిడ్నీ మార్పిడి అవసరమని డాక్టర్లు చెప్పారని, అంత డబ్బు తమ దగ్గర లేదని వాపోయాడు. తమ కూతురు వైద్యానికి ప్రభుత్వం, దాతలు సాయం చేయాలని కోరుతున్నాడు.

## చిన్నతనంలోనే అమ్మానాన్నను కోల్పోయి..

- ఇంటర్ ఫస్టియర్‌లో 478 మార్కులు
- ఐఏఎస్ అవుతానంటున్న అశ్రిత



అమ్మమ్మ-తాతయ్యతో అశ్రిత

**గోదావరిఖనిటౌన్(రామగుండం):** చిన్నతనంలోనే అమ్మానాన్నను కోల్పోయింది.. అమ్మమ్మ-తాతయ్య వద్ద ఉండి, చదువుకుంది. ఇంటర్ ఫస్టియర్ సీఈసీ విభాగంలో 478 మార్కులు సాధించి, కళాశాల టాపర్‌గా నిలిచింది.. ఐఏఎస్ అవుతానంటోంది అశ్రిత. గోదావరిఖని రమేశ్‌నగర్‌కు చెందిన ఆమె తల్లిదండ్రులు శ్యామల, శ్రీనివాస్ అనారోగ్యంతో గతంలోనే మృతిచెందారు. దీంతో అశ్రిత, ఆమె అక్క అక్షయ అన్నపూర్ణకాలనీలో ఉండే తమ అమ్మమ్మ-తాతయ్య సీతాసాయి-రాంబహదూర్ సాయి వద్ద పెరిగారు. వీరి తాతయ్య సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి. అమ్మమ్మ ఓ ప్రైవేట్ కంపనీలో వంట పని చేస్తోంది. పదోతరగతి వరకు మంచిర్యాల జిల్లా హాజీపూర్‌లోని కస్తూరిబా విద్యాలయంలో చదివిన అశ్రిత 9.2 జీపీఏ సాధించింది. అక్షయ కరీంనగర్‌లో నర్సింగ్ చదువుతోంది. వంటలు చేస్తూ ఇద్దరు మనవరాళ్లను పోషిస్తున్నానని తన భర్త పక్షవాతంతో బాధ పడుతున్నాడని సీతాసాయి కన్నీరు పెట్టింది. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతోంది. ద్వితీయ సంవత్సరంలో కష్టపడి చదివి, మంచి మార్కులు సాధిస్తానని, ఐఏఎస్ సాధించి, అక్కయ్య, అమ్మమ్మ, తాతయ్యను ఏ కష్టం రాకుండా చూసుకుంటున్నానని అశ్రిత తెలిపింది.

## ఇంటర్‌లో ఎల్లంపల్లి కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ



పావని



అక్షిత

**రామగుండం:** ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో అంతర్గాం మండలంలోని ఎల్లంపల్లి కేజీబీవీలో అత్యధిక మార్కులు సాధించినట్లు గురువారం ప్రిన్సిపాల్ తొటం కల్పన తెలిపారు. అడప పావని (461, ఎంపీసీ ఫస్టియర్), చెరుకుతోట అక్షిత (405, బైపీసీ ఫస్టియర్), కె.తేజశ్విని (981, ఎంపీసీ సెకండియర్), వారణాసి సంధ్య (955, బైపీసీ సెకండియర్) మార్కులు సాధించారు. ఇంటర్ ఫస్టియర్‌లో 67 మంది విద్యార్థులకు 31 మంది ఉత్తీర్ణత సాధించగా 46శాతం, సెకండియర్‌లో 82.97శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు.



తేజశ్విని



సంధ్య

**ఆదర్శ విద్యాలయంలో..**

మోడల్ (ఆదర్శ) విద్యాలయంలో ఇంటర్ ఫస్టియర్‌లో కె.శృతి (458-ఎంపీసీ), ఎస్.దీక్షిత (407-బైపీసీ), హెచ్.లక్ష్మినివాస్ (ఎంఈసీ-420), ఎస్.స్ఫూర్తి (484-సీఈసీ)లో మార్కులు సాధించారు. ఫస్టియర్‌లో 133 మంది పరీక్షలు రాయగా 77 మంది ఉత్తీర్ణత సాధించి 58 శాతం ఫలితాలు వచ్చాయి. ద్వితీయలో కిరణ్మయి (920-ఎంపీసీ), ప్రియాంక (956-బైపీసీ), అమూల్య (902-ఎంఈసీ), సాహిత్య (954-సీఈసీ) మార్కులు సాధించారు. 66శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ సారాతస్నీమ్ పేర్కొన్నారు.

## మలేరియా రహిత గ్రామాలుగా మార్చాలి



గర్రెపల్లిలో ర్యాలీ తీస్తున్న సిబ్బంది

**సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్:** 2030 వరకు మలేరియా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందని గర్రెపల్లి పీహెచ్‌సీ డాక్టర్ అనుదీప్ అన్నారు. సుల్తానాబాద్‌లోని అశోక్ నగర్, మండలంలోని గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా వేరు వేరుగా ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ శ్రీజ, సూపర్‌వైజర్ వెంకటరెడ్డి పాల్గొన్నారు

**ధర్మారం:** ధర్మారం పీహెచ్‌సీ వైద్యాధికారి సుశ్మిత ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్యాధికారి అమర్‌నాథ్, సూపర్‌వైజర్‌లు విజయలలిత, అసిస్టెంట్ మలేరియా అధికారి దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

**ఎలిగేడు:** మండల కేంద్రంలోని పీహెచ్‌సీ, ధూళికట్ట, సుల్తాన్‌పూర్‌లోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో గురువారం మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ శ్రావణి, స్టాఫ్‌నర్సులు వీణ, రాణి, వినయ, ఆరోగ్య విద్యా బోధకురాలు రాజేశ్వరిదేవి, సూపర్‌వైజర్‌లు నాగమణి, లక్ష్మణ్ పాల్గొన్నారు.